ర్యాగింగ్ రహితంగా
ఏయూను నిలపాలి
ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్



విశాఖపట్నం, జననేత న్యూస్: ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని ర్యాగింగ్ రహితంగా నిలుపుతూ, మంచి వాతావరణాన్ని కల్పించే దిశగా పనిచేస్తున్నామని ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ అన్నారు. ఏయూ పరిపాలనా భవనం నుంచి నిర్వహించిన యాంటీ ర్యాగింగ్ ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో యాంటీ ర్యాగింగ్ క్యాంపెయిన్‌ను విస్తృతంగా చేపడుతున్నామన్నారు. వర్సిటీకి కొత్తగా వచ్చే విద్యార్థులతో ఇంటరాక్ట్ కావచ్చునని, ఆవి పరిధి దాటకూడదన్నారు. ర్యాగింగ్‌ను అరికట్టడానికి విద్యార్థులతో అవగాహన కల్పించే విధంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. సీనియర్ విద్యార్థులు కొత్తగా వచ్చే విద్యార్థులకు మార్గదర్శకులుగా నిలవాలన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడితే జీవితాలు నాశనం అవుతాయని, చట్టాలు కఠినంగా ఉంటాయన్నారు. వీటిని గుర్తెరిగి సీనియర్ విద్యార్థులు నడచుకోవాలని హితవు పలికారు. కుటుంబాల నుంచి దూరంగా ఉంటూ హాస్టల్‌లో ఉండే విద్యార్థుల మధ్య సహృద్భావ వాతావరణం, స్నేహపూర్వక పరిస్థితులు నెలకొల్పడం జరుగుతోందన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ర్యాగింగ్ నిర్మూలనకు చిత్తశుద్ధితో యంత్రాంగం పనిచేస్తోందన్నారు. విద్యార్థి సంక్షేమం ప్రధానంగా స్టూడెంట్ వెల్ఫేర్ కార్యాలయం పని చేస్తుందన్నారు. విశ్వవిద్యాలయ, కళాశాల, విభాగ స్థాయిలలో ర్యాగింగ్‌ను పూర్తిస్థాయిలో నిర్మూలించే విధంగా పటిష్టంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రత్యేక కమిటీలు వీటిపై నిరంతరం పనిచేస్తున్నాయన్నారు. విభాగ స్థాయిలో ఎటువంటి సంఘటనలు చోటు చేసుకోకుండా విభాగాధిపతులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఏయూ పరిపాలనా భవనం నుంచి సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ కార్యాలయం, డిసిఎంఎస్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ కార్యాలయం, ఫార్మశీ కళాశాల ప్రిన్సిపాల్ కార్యాలయం, న్యాయ కళాశాల వరకు విద్యార్థులు ప్లకార్డులు పట్టుకుని ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కె.రాంబాబు, పాలక మండలి సభ్యులు ఆచార్య వి.వల్లీ కుమారి, ఆర్.పద్మశ్రీ, ప్రిన్సిపాల్స్, డీన్‌లు, హాస్టల్ వార్డెన్లు, విభాగాధిపతులు, ఆచార్యులు, ఏయూ విద్యార్థులు, అనుబంధ కళాశాలల విద్యార్థులు, ఎన్‌సిసి, ఎన్.ఎస్.ఎస్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.